ఆధార్ నవీకరణ తప్పనిసరి

- మూడు నెలలపాటు ప్రత్యేక శిబిరాలు
- చిత్తూరు నియోజకవర్గంలో 15 కేంద్రాలు
- ఆన్‌లైన్‌లో మాత్రమే ఉచితం

మీరు ఆధార్ కార్డు పొంది పదేళ్లు గడిచాయా.. అయితే వెంటనే అప్‌డేట్ చేసుకోండి. లేదంటే ఆగస్టు నుంచి మీ ఆధార్‌కార్డ్ పనికి రాకుండా పోతుంది. అదే జరిగితే పరిస్థితేంటో ఒక్కసారి ఆలోచించుకోండి. ప్రస్తుతం మన బతుకులన్నీ ఆధార్ మీదే ఆధారపడి ఉన్నాయి. బ్యాంకింగ్ సేవలతో పాటు, ప్రభుత్వాలిచ్చే సంక్షేమ పథకాలు, దైనందిన కార్యకలాపాలన్నింటికీ ఇక్కట్లు తప్పవు. అందుకే తక్షణమే మీ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.



గుడిపాల: సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

గుడిపాల: ఆధార్ కార్డు నవీకరణ (అప్‌డేషన్) కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగక్కర్లేదు. ప్రస్తుతం ఈ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు మూడునెలల పాటు ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు. మీ ఇంట్లో ఉన్న కంప్యూటర్‌లో వెబ్‌సైట్ ద్వారా లేదా మొబైల్‌లో మై ఆధార్ యాప్‌లోనైనా ఈ ప్రక్రియను ఉచితంగా చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి రుసుములు చెల్లించక్కర్లేదు. అరచేతిలోనే ఆధార్ అప్‌డేట్ చేసుకొనే అవకాశాన్ని ప్రభుత్వం అందించింది. బ్యాంకులు, కామన్ సర్వీసు కేంద్రాలు, సచివాలయాలు మాత్రం నిర్ణీత ఫీజు రూ.50తో సేవలు అందిస్తున్నాయి.

పాత ఆధార్ గడువు ఆగస్టు 31

ఆధార్‌కార్డు 2010 –16 మధ్య కాలంలో పొందిన వాళ్లు తమ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్‌కార్డు నమోదు సమయంలో కొన్నిసార్లు వ్యక్తిగత వివరాలున్న ధ్రువపత్రాలు సమర్పించకపోయినా కేవలం ఒక దరఖాస్తుతో ఆధార్ మంజూరు చేశారు. అలాంటి వారు తప్పకుండా తమ గుర్తింపు పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను ఆధార్‌కు జతచేసి, డాక్యుమెంట్ అప్‌డేషన్ చేసుకోవాలి. అలా అప్‌డేట్ చేసుకోని కార్డుల్ని ఈ ఏడాది ఆగస్టు 31 తరువాత చెల్లవని ప్రభుత్వం ప్రకటించింది.

మండలంలో 47,606 ఆధార్ కార్డులు

మండలంలో మొత్తం 47,606 మందికి ఆధార్ కార్డులు ఉన్నట్లు అధికారుల లెక్కల్లో తేలింది. ఇప్పటివరకు ఆధార్ అప్‌డేషన్ 10 శాతం వరకు మాత్రమే చేసుకున్నారని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన వారందరికీ కూడా గ్రామ వలంటీర్ల ద్వారా ఆధార్ అప్‌డేషన్ చేసుకోవాలని తెలియజేస్తున్నాం. మండలంలోని 15 గ్రామాల్లో వలంటీర్లు ఈ ఆధార్ అప్‌డేషన్ చేయించే పనిలో ఉన్నారు. ప్రజలు కూడా ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి ముందుకు రావాల్సి ఉంది.

ఆధార్ సేవలందిస్తున్న సచివాలయాలు

గుడిపాల మండలం: గుడిపాల, పానాటూరు, వసంతాపురం, 197రామాపురం

చిత్తూరు అర్బన్ మండలం: అంబేడ్కర్ నగర్, కట్టమంచి, టెలిఫోన్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, చామంతిపురం, మంగసముద్రం, మోరిగానిపల్లె, మురుకంబట్టు, పీహెచ్ వాడ

చిత్తూరు రూరల్ మండలం: తుమ్మింద, బీఎస్ఆర్ పేట

మార్పులు, చేర్పులకు అవకాశం

ప్రస్తుత అప్‌డేషన్లో భాగంగా ఆధార్‌లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉంది. చిరునామా, ఫోన్ నెంబర్ తదితర వివరాలను మార్చుకోవచ్చు. ప్రభుత్వం ఆమోదించిన పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్‌కార్డు, పాన్‌కార్డ్, బ్యాంక్/పోస్టల్ పాస్ బుక్ ఫొటోతో కూడిన రేషన్‌కార్డ్, ఆరోగ్యశ్రీ/ ఆయుష్మాన్ భారత్‌కార్డ్, గుర్తింపు పొందిన విద్యాసంస్థలు జారీచేసే పత్రాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కార్డులు తదితర 13 రకాల ధ్రువపత్రాల ద్వారా ఆధార్‌కార్డ్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చు.

సచివాలయాల్లోనూ అప్‌డేషన్



ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌డేట్‌ను చేసుకోవాలి. ఆధార్ పొందిన పదేళ్ల వ్యవధిలో ఎప్పుడైనా ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకుని ఉంటే అలాంటి వారు ఇప్పుడు చేసుకోకపోయినా పర్లేదు. పదేళ్లలో ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోని వారికి మాత్రం ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి. ఇలాంటి వారి కోసం మండలంలో ఆధార్‌కిట్లు వచ్చిన నాలుగు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. శిక్షణ అనంతరం అన్ని సచివాలయాలకు ఈ ఆధార్ శిబిరాలను విస్తరిస్తాం.

–ఉపేంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీవో, గుడిపాల

క్లుప్తంగా

రేపు సంత బహిరంగ వేలం

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం వారపు సంత బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ వాణీప్రియ, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో దిన, వారపు సంతకు సంబంధించి ఏడాది పాటు గేటు వసూలు చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని వారు కోరారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉపేంద్ర

గుడిపాల: రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో ఉపేంద్ర తెలిపారు. ఆయన శనివారం గుడిపాల, వసంతాపురం సచివాలయాలను తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ రికార్డులు ఎప్పటికప్పుడు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. ఇంటిపన్ను వసూలు, చెత్తసేకరణ కేంద్రాల పనితీరుపై ఆరా తీశారు. పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు అందరూ సమయపాలన పాటించి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు.

30న కల్యాణోత్సవం

చిత్తూరు రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకుని నగరంలోని తోటపాళ్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామభద్ర తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన చెప్పారు.

స్పందన సమస్య పరిష్కారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

పూతలపట్టు: మండలంలోని కొత్తపల్లెలో స్పందనకు వచ్చిన భూ సమస్య పరిష్కారమైంది. గ్రామస్తులు సోమవారం స్పందనలో భూ సమస్యలపై తహసీల్దార్ విజయభాస్కర్‌కు అర్జీ ఇచ్చారు. ఆ సమస్యను శనివారం ఎంపీడీఓ గౌరి, సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డితో కలిసి భూ సమస్యను పరిష్కరించారు. అంతేకాగ రైతులకు మరిన్ని భూ సమస్యలుంటే వాటిని సర్వేయరు సహాయంతో కొలిచి సమానంగా అప్పగించారు.

దహనక్రియలకు సాయం

పూతలపట్టు: మండలంలోని నాగిరెడ్డిపల్లెకు చెందిన సరోజమ్మ కిడ్నీ సమస్యతో బాధపడుతూ శనివారం మరణించారు. ఆమె అనాథ కావడంతో దహన క్రియలకు పూతలపట్టు సర్పంచ్ మాసిలామణి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మురుగేష్, బాలాజీ, ఎంపీటీసీ షన్ముగం, శివాజి పాల్గొన్నారు.


సీఎం నిర్ణయంపై క్రైస్తవుల హర్షం



జాషువాను సన్మానిస్తున్న క్రైస్తవ పెద్దలు

చిత్తూరు రూరల్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయడంపై క్రైస్తవ మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు చిత్తూరు నగరం గిరింపేటలోని చర్చిలో శనివారం సమావేశం నిర్వహించి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.జోబ్, క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ జాషువ, క్రైస్తవ మత పెద్దలు డి.రాబర్ట్, షడ్రక్, సి.రాబర్ట్, ప్రసాద్ సామ్సన్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పుల్లారెడ్డి



కార్వేటినగరం: కార్వేటినగరం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పుల్లారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. వెదురుకుప్పం తహసీల్దార్‌గా ఉన్న ఈయనను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్వేటినగరం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. ఇక్కడ శ్రీరంగరాజపురం తహసీల్దార్ షబ్బీర్‌బాషా ఇన్‌చార్జ్‌గా వ్యవహరించేవారు. అయితే ఇటీవల ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

నేడు హైకోర్టు జడ్జి రాక

చిత్తూరు అర్బన్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ మానవేంద్ర నాథ్ రాయ్ ఆదివారం చిత్తూరుకు రానున్నారు. ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని తిరుపతి, మదనపల్లె, చిత్తూరుకు చెందిన న్యాయమూర్తులతో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశమందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి పలు ప్రాంతాల నుంచి న్యాయమూర్తులు హాజరుకానున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పూతలపట్టు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సీహెచ్ఓ శ్రీనివాస మూర్తి తనిఖీ చేశారు. కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. పిల్లల పౌష్టికాహార పంపిణీ వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సిబ్బంది సుస్మిత, ప్రభావతి, సుజన తదితరులు పాల్గొన్నారు.

1289 సంఘాలకు ఆసరా

తవణంపల్లె: మండలంలోని 1289 సంఘాల్లోని 11,529 మంది సభ్యులు వైఎస్సార్ ఆసరా పథకం కింద లబ్ధి పొందినట్లు ఏపీఎం రవి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం 3వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. సీఎం ప్రసంగాన్ని మండలంలోని 17 సచివాలయాల్లో స్వయం సహాక సంఘాల్లోని ఆసరా లబ్ధిదారులు ఆలకించారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

పూతలపట్టు: కారు బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం ఉదయం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు, తమిళనాడు ఆంబూరుకు చెందిన రవి, ఆయన భార్య కారులో తిరుమల దర్శనం ముగించుకొని తిరుగు పయనమయ్యారు. పాలకూరు వద్ద నెంబరు రాయిని ఢీకొట్టి కారు బోల్తా పడింది. దీంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు.

ఏకపక్ష నిర్ణయం శోచనీయం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పాలకమండలి, గ్రామపంచాయతీకి సంబంధించిన పార్కింగ్ రుసుం వసూలుపై ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం శోచనీయమని కాణిపాకం సర్పంచ్ కె.శాంతిసాగర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పునరాలోచించాలని కోరారు.

పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీలు



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

గుడిపాల: పూర్తిస్థాయి పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ శ్యామ సుగుణకుమారి అన్నారు. మండలంలోని కుప్పిగానిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలు, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికల్లో రక్తహీనత సమస్య ఉండకూడదని చెప్పారు. మందుల వినియోగం అవసరం లేకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. తాజా పండ్లు, కూరగాయలు, మాంసం, గుడ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలు, చిరుధాన్యాలు ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, వెల్ఫేర్ అసిస్టెంట్ గోపి, ఏఎన్ఎం సరిత పాల్గొన్నారు.

ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



సమావేశంలో మాట్లడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ 2023–24 బడ్జెట్ ప్రతిపాదనలను కౌన్సిల్ ముందు ఉంచడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదముద్ర వేసింది. చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం శనివారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో నిర్వహించారు. నగర కమిషనర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, ఆర్.జి.శ్రీకాంత్, బి.పూర్ణ చంద్రరావు, సి.శోభ, ఎ.జి.సహదేవన్ పాల్గొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి కూరగాయల మార్కెట్, స్లాటర్ హౌస్, ఎన్టీఆర్ బస్టాండు, కాసు బ్రహ్మానంద రెడ్డి బస్టాండ్ వేలంపాట నిర్వహణకు, నీటి సరఫరా చార్జీలకు సంబంధించి నియమావళిని ఆమోదించారు. నగరపాలక సంస్థ పరిధిలో నీటి సరఫరా మోటార్ల లిఫ్టింగ్ కోసం బోర్ మోటార్ లిఫ్టింగ్ యంత్రం కొనుగోలుకు టెండర్ దాఖలు చేసి ఎల్–1గా నిలిచిన బిడ్డరుకు ఎల్ఓసీ జారీ చేసేందుకు ఆమోదముద్ర వేశారు. 40వ డివిజన్ పరిధిలో మార్కెట్ యార్డ్ పక్కన డ్రైనేజీ కాలువ నిర్మాణానికి 2022–23 సాధారణ నిధులను వినియోగించడానికి కమిటీ ఆమోదించింది. సమావేశంలో ఎంఈ ధనలక్ష్మీ, ఎంహెచ్వో లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేయాలి

- సమీక్షలో కలెక్టర్ హరి నారాయణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ(డి ఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లైసెన్స్ విధానంపై పరిశ్రమల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.4,196 కోట్లతో 3,608 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్‌లో రిజిస్టర్ అయినట్లు తెలిపారు. వీటిద్వారా 14,218 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. పలమనేరు సమీపంలోని గంద్రాజుపల్లి పారిశ్రామిక వాడలో రోడ్లు మరియు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. గంగాధర్ నెల్లూరు మండలంలో మంజూరు చేసిన స్థలాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించి పరిశ్రమలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, జిల్లా పరిశ్రమల మేనేజర్ చంద్రశేఖర్, వాణిజ్య పనుల శాఖ అధికారులు, సంక్షేమ శాఖ అధికారి మురుగేష్, జిల్లా అగ్నిమాపక అధికారి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకష్టారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోని, ఏపీ ఎస్ఎఫ్‌సీ మేనేజర్ రామాంజనేయులు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, గనుల శాఖ అధికారి ప్రసాద్, రవాణా అధికారి రాజేశ్వరరావు జిల్లా రిజిస్టర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, మార్కెటింగ్ శాఖ అధికారి, సభ్యులు గోవర్ధన్ బాబి, ధనంజయులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



విద్యార్థినికి నగదు అందజేస్తున్న సర్పంచ్

గుడిపాల: విద్యార్థుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరి కృషి చాలా అవసరమని కమ్మతిమ్మాపల్లె జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు భానుప్రసాద్‌రావు అన్నారు. కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసూదన్ రాయల్ 2021–22 సంవత్సరంలో పదవ తరగతిలో పాసైన మొదటి పదిమంది విద్యార్థులకు శనివారం నగదు బహుమతులను ప్రదానం చేశారు. కమ్మతిమ్మాపల్లె పాఠశాల పదవ తరగతి వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వం ఎన్నో రకాలుగా ఆదుకుంటోందని ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున అందజేశారు.

వరిలో మెలకువలు పాటించాలి



వరి సాగు పరిశీలనలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ

పూతలపట్టు: వరి సాగులో మెలకువలు పాటించి.. అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకష్ణ అన్నారు. మండలంలోని తేనేపల్లిలో శనివారం పొలంబడి క్షేత్రాన్ని నిర్వహించారు. ఆయన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి పంట సాగులో ఎరువుల వాడకం తగిన మోతాదులోనే వాడాలని సూచించారు. ఇందుకు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. మిరప పంట పూతదశలో నల్లి తామరపురుగు అధికంగా వ్యాపించే అవకాశాలు ఉన్నాయన్నారు. దీని దష్ట్యా రైతులు ముందస్తుగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నాట్లు వేసుకోవాలని సూచించారు. తదనంతరం తేనేపల్లి, ఒడ్డేపల్లి రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ మధుర వాణి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రేణుక

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు డివిజన్ పరిధిలో దళితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నామని ఆర్డీవో రేణుక అన్నారు. ఆమె శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ అన్ని మండలాల్లో దళితుల శ్మశాన వాటికలకు స్థలం గుర్తిస్తున్నట్లు చెప్పారు. నమోదైన అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు. అన్ని మండలాల్లో మూడు నెలలకు ఒకసారి ఖచ్చితంగా సివిల్ రైట్స్ డే సమీక్ష కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సమీక్షలో ఏవో రామాంజులునాయక్, ఉపాధికల్పనా శాఖాధికారి పద్మజ, పలు మండలాల తహసీల్దార్లు, డీవీఎంసీ సభ్యులు రంగపల్లి మునస్వామి, ధనంజయరావు, రాజ్‌కుమార్, దేవరాజులు, బాబు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

పుత్తూరు రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 11 గంటలకు పుత్తూరు నుంచి, మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి నుంచి తిరువణ్ణామలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుగు ప్రయాణంలో తిరువణ్ణామలై నుంచి పుత్తూరుకు ఉదయం 4 గంటలకు, తిరుపతికి ఉదయం 6 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బిల్లుల దుర్వినియోగంలో ఉద్యోగులే బాధ్యులు



బిల్లులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ

యాదమరి: స్థానిక పంచాయతీలో ఉపాధి కూలీల బిల్లుల దుర్వినియోగంలో ఉద్యోగులందరూ బాధ్యత వహించాల్సిందేనని ఎంపీడీఓ శివరాజ్, ఈఓ పీఆర్డీ హరిప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధిలో చోటుచేసుకున్న అక్రమాలపై శనివారం మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ కవిత, ఈసీ రమ్య సమావేశం నిర్వహించారు. దుర్వినియోగమైన బిల్లుల వివరాలు ఇవ్వాలని కోరారు. పనులు చేసిన కూలీలను పిలిపించారు. వారి వద్ద ఉన్న బిల్లులను కూలీలు అధికారులకు చూపించారు. దీనిపై తమకు సంబంధం లేదు సార్ అని ఏపీఓ, ఈసీ చెప్పడంతో వారిపై ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాధవరం, మాదిరెడ్డిపల్లె, 14 కండ్రిగ ముస్లింవాడ, కొటాల పంచాయతీలలో చాల వరకు పనులు చేయకలే బిల్లులు పెట్టారని ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వివరాలు కూలీలే సేకరించి మీడియాకు ఇస్తుంటే సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం అవుతుందన్నారు. వీటిపై అన్ని నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ ఫిజీషియన్'







ఎ.గొల్లపల్లెలో సేవలందిస్తున్న వైద్య బృందం, వెంగంపల్లె హైస్కూల్లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత

తవణంపల్లె: మండలంలో 87 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి తెలిపారు. మండలంలోని ఎ.గొల్లపల్లెలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి దాత్రేయచౌదరి 87 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వెంగంపల్లె హైస్కూల్లో..

జాతీయ సేవా పథకం ప్రత్యేక క్యాంపులో భాగంగా శనివారం వెంగంపల్లె హైస్కూల్లో 63 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి తెలిపారు. వెంగంపల్లె అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ప్రత్యేక శిబిరం నిర్వహించినట్లు వివరించారు. అపోలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ యశ్వంత్, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ హేమప్రియ వెంగంపల్లె హైస్కూల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 63 మందికి వైద్య పరీక్షలు చేయించినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నాగవాండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని నాగవాండ్లపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల జోలికెళ్లద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం విజ్ఞానదీప్తి పాఠశాల సిల్వర్ జూబ్లీ సమావేశం నిర్వహించారు. పాల్గొన్న జెడ్పీ చైర్మన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయంతో కష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా విద్యనభ్యసించాలని తెలిపారు. చదువుతోపాటు విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, ఆ పాఠశాల కరస్పాండెంట్ నరేష్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.